## ప్రాథమిక పాఠశాల ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం 59వ వార్డు పరిధిలో లక్ష్మీ నగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం కూల్చేసి ఆస్థానంలో నూతన భవనం సెంట్రల్ గవర్నమెంట్ నిధులతో సుమారుగా 60 కోట్లు వ్యయంతో నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని బుధవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పివి గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సి.హెచ్.రామ్మోహన్ నాయుడు, జనసేన ఇన్‌చార్జి అంగ దుర్గా ప్రశాంతి, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, 59వ వార్డు జనసేన నాయకులు పుర్రె సురేష్, ఆయన సతీమణి వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణ శ్రీ, ఏడు వార్డుల ఎస్సీ సెల్ ప్రతినిధి జోజ్ బాబు, ఉరుకుటి మహేష్, కూటమి నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణం కూల్చివేత



విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ జోన్ 2లో అనధికార నిర్మాణాలపై విశాలాంధ్ర ప్రచురించిన కథనానికి టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి బుధవారం చంద్రంపాలెంలో ఓ భారీ అపార్ట్మెంట్ నిర్మాణం స్లాబ్‌ను కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరగడంతోపాటు ఆపై అనధికార పై అంతస్తు నిర్మాణం కూడా జరగడం వెనక ప్లానింగ్ సెక్రటరీ రాము నాయుడు భారీగా ముడుపులు తీసుకుని అండదండలు అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిపి నెంబర్ 1086/ 6652/ బి2 గల ప్లాన్ పొందిన ఈ భవనంపై ఇటీవల ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా చిన్న రంధ్రాలు పెట్టి చేతులు దులిపేసుకున్న ప్లానింగ్ సెక్రటరీ టౌన్ ప్లానింగ్ వార్డులో ఇష్టారాజ్యంగా అనధికార నిర్మాణాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

విశాలాంధ్ర ఎఫెక్ట్

# తీర ప్రాంతం సంరక్షణకు షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్

### కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ, థాన్ ఫౌండేషన్, రెడింగ్టన్ సంయుక్త నిర్వహణలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నిలిచే విధంగా సుమారు 1200 మొక్కలు గంగా రావి, సరుగుడు, బాదం, రావి, మర్రి, కొబ్బరిలను వీఎంఆర్డీఏ పార్కులో 1.5 ఎకరాల విస్తీర్ణంలో నాటే కార్యక్రమాన్ని విశాఖ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లతో కలిసి కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల తుఫానులు, ఉప్పెనలు సంభవించినప్పుడు తీర ప్రాంత ఇసుక తిన్నెలు కోతకు గురికాకుండా ఉంటుందని, తీవ్ర గాలులు వీచినప్పుడు ప్రకృతి సహజ సిద్ధమైన కవచంలా ఉంటుందని.., ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడుతుందని చెప్పారు. శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలు, ఆవాసాలు దెబ్బతినకుండా జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం, గాలి, నీటి నాణ్యత పెంపొందించడం వంటి ఎన్నో ఉపయుక్తమైన ప్రక్రియలు ఇందులో ఉన్నాయని అన్నారు. పక్కనే ఉన్న జాలారిపేటకు ఈ ప్లాంటేషన్ వల్ల లబ్ధి చేకూరుతుందన్నారు. వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా విశాఖపట్నంలో గ్రీన్ కవర్ పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ దీనిని మిగతా తీర ప్రాంతాలకు కూడా విస్తరించి తద్వారా అర్బన్ గ్రీన్ కవర్ పెంపొందించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాటిన మొక్కల సంరక్షించే బాధ్యతను సాగరతీర కలాంజియ సమాఖ్యకు అప్పగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ జాయింట్ కమీషనర్ రమేష్, డీఎఫ్ఓ శివానీ, కార్పొరేటర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## 29న సింహాద్రి నాధుని తెప్పోత్సవం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి తెప్పోత్సవం (తెప్ప తిరునాళ్ళు) ఈ నెల 29న జరుగనుంది. 29 పుష్య బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి తెప్పోత్సవం కొండ దిగువ వరాహ పుష్కరిణిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఏఈఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి వారు ఆరోజు సుమారు గం.3.30 ని..లకు కొండపై నుండి బయలుదేరి మెట్ల మార్గం ద్వారా కొండ దిగువ వరాహ పుష్కరిణికి చేరుకుంటారన్నారు. సాయంత్రం సుమారు గం.5. ల తదుపరి వరాహ పుష్కరిణిలో శ్రీ స్వామి వారి తెప్పోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 29 సాయంత్రం గం.6 ల వరకు మాత్రమే భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనములు లభిస్తాయని, గం.6. ల తదుపరి శ్రీ స్వామి వారి దర్శనాలు లభించవన్నారు.

## రోగులకు అన్నసంతర్పణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉమెన్ రైట్స్ కమిషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రేమ సమాజం ఏవీఎన్ కాలేజీ కూడలిలో ఉన్న రోగులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేయడం జరిగింది. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షురాలు మన్యం ఉషా రోగులకు అన్నదానం చేశారు. కమిషన్ ఉపాధ్య క్షురాలు బుద్దాల లక్ష్మి, మన్యం మురళీకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చితకాల రాజబాబు, భారతీయ జనతా పార్టీ నగర ఉపాధ్యక్షులు చొక్కాకుల రాంబాబు పాల్గొన్నారు.

## అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలానికి చెందిన ఓ మైనర్ బాలికపై (13) అదే గ్రామానికి చెందిన బోర ఎల్లయ్య రెడ్డి అనే వ్యక్తి మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడినట్టు 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఏసీపీ అప్పలరాజు, సిఐ సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులను చుట్టు ప్రక్కల వారి నుండి వివరాలు సేకరించి నిందితున్ని వెంటనే అరెస్ట్ చేసి ఫోక్సో కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పరస

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పరస మహోత్సవం బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. 16 కుల సంఘాలు ఐక్యంగా చేసుకునే అతిపెద్ద మహోత్సవానికి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన పరస మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## గీతంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - మధురవాడ: సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికి పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత చిరకాలం ఉంటుందని ముఖ్యంగా విద్యార్థి దశలో పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలకు తీసుకువెళుతుందని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణ శేఖరన్ పేర్కొన్నారు. గీతం నాలెడ్జి రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పుస్తక ప్రదర్శనను ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యార్థులలో పఠనాసక్తిని పెంచడానికి పుస్తక ప్రదర్శన దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గీతం గ్రంధాలయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.పి.ఎ.బాలసుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఉపయోగపడేలా దేశంలోని ప్రముఖ ప్రచురణకర్తలతో రెండు రోజుల పాటు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన కనబడుతోందని ఇకపై ఏటా ఇలాంటి పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలిపారు. గీతం గ్రంధాలయ అధికారి డాక్టర్ శివ ప్రసాద్ పాండా ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ పుస్తక ప్రదర్శనలో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్, వైద్య రంగాలకు చెందిన గ్రంధాలను అందుబాటులో ఉంచారు. తాము చదువుతున్న కోర్సులలో నూతన అంశాలపై గ్రంధాలను సహితం పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉంచడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రజా సహకారంతోనే చెరువుల పునరుజ్జీవం: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - భీమిలి: జీవనాధారమైన నీటిని సంరక్షించుకోవడంలో భాగంగా చెరువులను పునరుజ్జీవం చేసుకోవడం ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిన విషయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. థాన్ ఫౌండేషన్, వి.ఎం.ఆర్.డి.ఎ., జీవీఎంసీ, జిల్లా యంత్రాంగాల సంయుక్త ఆధ్వర్యంలో కాపులుప్పాడలో బుధవారం సి.ఎ.ఎస్.సి.ఎ.డి.ఈ. పథకం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పట్టణీకరణ కారణంగా అనేక చెరువులు కనుమరుగైపోవడం లేదా చెత్తా చెదారంతో నిండిపోవడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా భాగస్వామ్యంతోనే చెరువు గర్భాలను రక్షించుకోవడం సాధ్యపడుతుందని చెప్పారు. చెరువు పునరుజ్జీవంతో పాటు సుందరీకరణపై దృష్టి పెట్టి కాపులుప్పాడ చెరువును అందరికీ ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. తాను అనకాపల్లి ఎంపీగా ఉన్నప్పుడు పూడికతీత కోసం ప్రొక్లెయిన్, టిప్పర్లను ఉచితంగా ఇచ్చేవాడినని, ప్రజల నుంచి వచ్చిన అనూహ్య స్పందన చూసి నీరు - చెట్టు అనే ప్రభుత్వ కార్యక్రమంగా రాష్ట్రమంతా దాన్ని అమలు చేశారని వివరించారు. భీమిలి నియోజకవర్గంలోని అనేక చెరువులు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని, వాటిని సంస్కరించడానికి స్పెషల్ డ్రైవ్ అమలు చేయాలన్నారు. రూ.98 లక్షలతో 16 చెరువులకు పునరుజ్జీవం తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి కాపులుప్పాడ చెరువును పరిశీలించారు. ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్, ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి, నాయకులు పాల్గొన్నారు.

## కురపల్లిలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - పద్మనాభం: విశాలాంధ్రలో ప్రచురితమైన వార్తకు పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం కురపల్లి గ్రామంలో ఉన్న నీళ్ల ట్యాంకువద్దే కాక గ్రామంలోని చెత్త పోగులు అన్నిటిని జెసిబి ద్వారా ట్రాక్టర్ లోడ్ చేసి చెత్త శుద్ధి కేంద్రం వద్ద విడిచిపెట్టడం జరిగింది. మురికి కాలువలో పేరుకుపోయినటువంటి చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులతో తీసివేయించారు. నీళ్ల ట్యాంకు వద్ద ఎవరు చెత్తాచెదారం వెయ్యవద్దని, ఇతర అపరిశుభ్రమైన పనులు చేయడం తద్వారా నీరు కలుషితమై అనారోగ్యం బారిన పడవద్దన్నారు.

## పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో వార్డు అభివృద్ధిలో భాగంగా సుమారు 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నడుపూరు హైస్కూల్ పక్కనున్న పెదగంట్యాడ జీవీఎంసీ మైదానం అభివృద్ధికి గాజువాక నియోజక వర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రజలందరూ ఇలాంటి ఆహ్లాదకరమైన ఉత్తేజ పూర్వకమైన మైదానాలను వాడుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, 75వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, జనసేన వార్డు అధ్యక్షులు కోన చిన అప్పారావు, బీజేపీ నాయకులు కిలాన ముసలయ్య, వరలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీముసిరి శ్రీనివాస రావు, పెద్దాడ సోము నాయుడు, ములకలపల్లి పెంటయ్య, టేకేటి అప్పారావు, బొంగు రాజు, ఊరుకుటి అప్పారావు, యూత్ నాయకులు మొల్లి పెంటి రాజు, పులి సురేష్ రెడ్డి (బాబీ), ఇతర నాయకులు సన్యాసమ్మ, సరోజినీ, పుష్పలత, అప్పల స్వామి, లక్ష్మి, శివ గణేష్, అప్పల రెడ్డి, సోము నాయుడు, రమణ, అప్పల రాజు, మణికంత, సింహాచలం, పులి శ్రీరామ రెడ్డి రాజు, సింహాద్రి, రమణ, పిట్ట గురునాథ రెడ్డి, స్వామి, యంపాడ పైడి రెడ్డి తదితరులు, జీవీఎంసీ ఈఈ అప్పారావు పాల్గొన్నారు.

## లోకేష్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన, వైద్య శిబిరాలు

### వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో గురువారం మెగా రక్తదాన శిబిరం, మెగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ 5వ వార్డులోని అన్న క్యాంటీన్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం, రాత్రి ఎంతమంది భోజనం చేస్తున్నారనే రికార్డును పరిశీలించారు. మధ్యాహ్నం 350 మంది, రాత్రి 200 మంది సగటున వస్తున్నారని సూపర్ వైజర్ చెప్పారు. డిమాండ్ లేనప్పుడు మిగిలిపోయిన ఆహార పదార్థాలు ఏం చేస్తారన్న దానిపై ఆరా తీశారు. మిగతా ప్రాంతాల్లో ఆహార పదార్థాల అవసరాలను తెలుసుకుని వాటిని అక్కడకు పంపుతామని క్యాంటీన్ ఉద్యోగులు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవడానికి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం తిన్నారు. అన్నం సరిగా ఉడకలేదని, భవిష్యత్‌లో ఇలాంటి ఫిర్యాదు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్ వైజర్‌ను హెచ్చరించారు. అనంతరం క్యాంటీన్ ఉద్యోగులు తమ సమస్యలను గంటా దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, బోయి వెంకట రమణ, నమ్మి రవి, రామునాయుడు, గుప్తా, రమణ పాల్గొన్నారు.

## రొయ్యల హేచరీల్లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - తగరపువలస: జాయింట్ కలెక్టర్/ చైర్మన్, టాస్క్ ఫోర్స్ కమిటీ, విశాఖపట్నం వారి ఆదేశాల మేరకు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం భీమిలి మండలంలోని రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో మంగమారిపేట, తిమ్మాపురం సమీపంలోని పలు హేచరీలలోని వసతులు, రొయ్య పిల్లల ఉత్పత్తి ప్రక్రియలో వాడుతున్న ప్రోబయోటిక్స్, ట్రీట్మెంట్ ప్లాంట్స్, బ్రూడ్ స్టాక్‌లను పరిశీలించారు. తదుపరి పరీక్షల నిమిత్తం ఎంపెడ (ఎంపిఈడిఎ) వారు నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎ.డి. ఎం పేడ (ఎంపిఈడిఎ) ప్రసాద్ నాయక్, డ్రగ్ ఇన్స్పెక్టర్ అభిప్రియ, ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్‌రావు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పిఎస్‌వి ప్రసాద్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆమ్రపాలిని కలిసిన వీఎంఆర్డీఏ చైర్మన్

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలిని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో సమావేశానికి వచ్చిన ఆమెకు మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా టూరిజం ప్రాజెక్టులపై చర్చించారు.

## వైభవంగా స్వాతీ నక్షత్ర హోమం

విశాలాంధ్ర - గోపాలపట్నం: సింహగిరిపై స్వాతి నక్షత్రం సందర్భంగా సింహాద్రి నాధుని హోమం, పూర్ణాహుతి వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు శ్రీ నృసింహ హోమం, పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత చక్రపెరుమాళ్ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అగ్ని మథనం, హోమ గుండ ప్రదక్షిణం చేశారు. అనంతరం యజ్ఞ భగవానుడికి పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న స్వామికి వేకువజామున పూజాదికాలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తులను యాగశాలలో అధిష్టింపజేసి విశ్వక్సేన, పుణ్యా హవచనం పూజలు జరిపారు.

## 43వ ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్స్‌లో ఈ నెల 24, 25, 26 తేదీలలో జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల స్వాగత సమితి ప్రధాన కార్యదర్శి పివిఎస్ మాధవ్ పిలుపునిచ్చారు. స్థానిక మేఘాలయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్రతో కలిసి మాట్లాడారు. దాదాపు 21 ఏళ్ల తర్వాత విశాఖ నగరంలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం ప్రస్తుత, పూర్వ కార్యకర్తలకు ఆనందదాయకం అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేస్తున్న 2500 మంది ప్రతినిధులకు అతిథ్యం కోసం విశాఖ పుర ప్రజలు, విద్యావేత్తలు, జాతీయవాద శక్తులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో తామందరూ విద్యార్థి నాయకులుగా ఎదగటానికి క్రమశిక్షణ, దేశభక్తి ఏబీవీపీ నుంచి నేర్చుకున్నామని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో స్థిరపడిన పూర్వ ఏబీవీపీ కార్యకర్తలతో ఈ 25వ తేదీన నగరంలో అంగరంగ వైభవంగా యాత్ర జరుగుతుందని అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర మాట్లాడుతూ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 1949న ప్రారంభమై నేడు 57,87, 877 మంది సభ్యత్వంలో ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంస్థగా అవతరిం చిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు కిరణ్, జిల్లా కన్వీనర్ నితిన్, మహిళా కన్వీనర్ హరిచంద్రిక, ప్రసాద్, రాయుడు నితిన్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ



విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాభ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శ్రీ పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంఘాలు ముందుకు రావాలని అన్నారు. హెచ్.ఎం. ఉమారాణి మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలంటే చాలా సమయం పడుతుందని ఈలోపు విద్యాసంవత్సరం ముగిసి పోతుందని అందువల్ల స్థానిక పెద్దలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఎం.అప్పలనాయుడు, సాలాపు శ్రీనివాసరావు, జనతా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.విమల, సభ్యులు బలివాడ రమా కుమారి, దాసరి శివలక్ష్మి, ఏ.అరుణ, ఇన్జేటి జ్యోతి ప్రద, జమున, బేగం, ఉపాధ్యాయులు శోభారాణి, అమర పిన్ని అరుణ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని మోసపూరిత ఏజెన్సీలపై చర్యలు: సీపీ



విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఉద్యోగాల కోసం షార్జాకు వెళ్ళి మోసపోయిన ఉత్తరాంధ్ర బాధితులను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో క్షేమంగా వైజాగ్ తీసుకురావడం జరిగింది. షార్జా నుండి బాధితుడు ఫోన్ ద్వారా సీపీకి తమ గోడును వివరించగా వెంటనే స్పందించిన సీపీ షార్జాలో చిక్కుకున్న ఐదుగురు యువకులను ఇండియా తీసుకురావడం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎయిర్పోర్ట్‌కి చేరుకున్న యువకులను రిసీవ్ చేసుకున్న నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన యువకులు విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించిన గాజువాక ఆటోనగర్‌కు చెందిన మణికంత ఇనిస్టిట్యూట్‌కు ఒక్కొక్కరు 73 వేలు కట్టి మోసపోయామని చివరికి అక్కడ ఉద్యోగం లేక షార్జాలో చిక్కుకున్న బాధితుల నుండి ఫోన్ కాల్స్‌తో రెస్క్యూ చేసి విశాఖ తీయకొచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా రిక్రూట్మెంట్ ఏజెంట్లు/ కన్సల్టెన్సీలు ప్రజలను మోసగిస్తే ఇమ్మిగ్రేషన్ యాక్ట్-1983 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ ద్వారా ఉత్తరాంధ్రలో నిరుద్యోగులు..ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు ఏజెన్సీలు ఏజెంట్‌ల చేతిలో ఎలా మోసపోతున్నారో స్టడీ చేసి ప్రభుత్వంకి రిపోర్ట్ చేసే ఆలోచన చేస్తున్నామని సీపీ అన్నారు.

## బదిలీపై వెళ్తున్న సంపత్ కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పరిపాలనలో కొద్ది కాలంలో ప్రజల మన్ననలందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌ను విశాఖ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి సి.డి.ఎమ్.ఎగా బదిలీపై వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్‌కు ఆత్మీయ సన్మానం తోపాటు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి నప్పటి నుండి జీవీఎంసీలో అన్ని విభాగాలను సమన్వయ పరుస్తూ ప్రతి విభాగానికి దిక్సూచిగా ఉంటూ ప్రతి అధికారికి తగిన సూచనలు చేస్తూ, అవసరమయ్యే మౌలిక వసతులు కలపనే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. అనం తరం కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో కమిషనర్‌గా పనిచేసిన ఆరు నెలల కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని, అందుకు ప్రజా ప్రతిధులు, అధికారులు, ఉద్యోగులు సహకరించారని తెలిపారు. జీవీఎంసీ పరిపాలనలో పనిచేసే వారిపై నమ్మకం ఉంచాలని, సమస్యలు తప్పుదోవ పట్టించే వారిని గమనించాలని, మనిషి స్థాయి చూడకుండా మనిషిగా గుర్తించి పని చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారామ్, సిపిఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ పాల్గొన్నారు.

## గొట్టిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా అదనపు డిప్యూటీ డైరెక్టర్ పి.మోహిని కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూడలు అన్నింటికీ నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా త్రాగించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవడం వలన సీజనల్ వ్యాధుల నుండి పశువుల్ని కాపాడుకోవచ్చని సూచించారు. శాస్త్రీయ పద్ధతిలో పశు యజమాన్య విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో 46 పశువులకు, 25 లేగ దూడలకి నట్టల నివారణ మందులు, అదేవిధంగా లేబొరెటరి వారు హాజరై పేడ పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. పి.అనిల్ కుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ - పూలే క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతి ఏటా మాదిరిగానే మనభూమి దినపత్రిక ప్రచురించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్- పూలే క్యాలండర్ 2025ను వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఆవిష్కరించారు. సిరిపురం జంక్షన్‌లోని వీఎమ్మార్డీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, సావిత్రి బాయ్ పూలే లాంటి ఎందరో మహానీయులు కృషి మూలంగా సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం వారు చేసిన కృషి మరవలేనిది అన్నారు. కార్యక్రమంలో ఎడిటర్ పి.సత్యనారాయణ, సీనియర్ సబ్ ఎడిటర్ ఎన్.శ్రీనివాసు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంవి గిరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ ఎంవి గిరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు కేక్ చేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## బోయిదాపు అప్పారావు చిరస్మరణీయుడు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: బోయిదాపు అప్పారావు చిరస్మరణీయుడు అని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ఆయన మన మధ్య లేకపోయిన, అందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. గోపాలపట్నం వారి స్వగృహంలో అప్పారావు దిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వీరి కుటుంబ సభ్యులు బోయిదాపు ప్రసాద్, రవికుమార్‌లకు ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో యేల్లేటి శ్రీనివాసరావు, చింతల ప్రసాద్, సన్యాసి రావు, పి.రామారావు, వై.దేముళ్ళు తదితరులు పాల్గొని బోయిదాపు అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## హిందీ ప్రతిభ పరీక్షలో సత్తా చాటిన పద్మనాభం కేజీబీవీ విద్యార్థినిలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు దశమండ విద్యా సేవా సదన్ రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభా పరీక్షలో రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలియజేశారు. విద్యార్థినిలు హిందీ టీచర్ ఎన్.కోమలి సూచనలు, సలహాలు, సహకారంతో రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచినట్లు తెలియజేశారు. రాష్ట్రస్థాయి మెరిట్ సర్టిఫికేట్లుతోపాటు ఐదు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలను సాధించినట్లు తెలియజేశారు. డిఈఓ ప్రేమ్ కుమార్, ఏపీసి డాక్టర్ జె.చంద్రశేఖర్, జీసిడివో డాక్టర్ కాలేశా బేగం విద్యార్థినీలను ఉపాధ్యాయులను, అభినందించారు.

## సామాజిక పెన్షన్లు తనిఖీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి బుధవారం ఆనందపురం మండలంలో గంభీరం, చందక, గొట్టిపల్లి, పాలవలస, ముచ్చర్ల , మామిడిలోవ పరిధిలోని 9 మంది హెల్త్ పెన్షనర్లను వారి నివాసం వద్ద, నేరుగా జిల్లా నుండి వచ్చి తనిఖీలు నిర్వహించి, అర్హత పెన్షన్ కొరకు పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా అధ్యక్షుడ్ని కలిసిన పద్మనాభం బిజెపి శ్రేణులు

విశాలాంధ్ర - పద్మనాభం: భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులు మంతెన మురళీ నాగ పరశురామ రాజుని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన పద్మనాభం మండల బిజెపి నాయకులు. పద్మనాభం మండల బిజెపి అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో మండల నాయకులు పరశురాము రాజును దుశ్శాల్వ కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ పరశురామరాజు అరకు పార్లమెంటు బిజెపి ఇన్చార్జిగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి ప్రసంగిస్తూ పరశురామరాజు నాయకత్వంలో మండలంలో పార్టీని అన్ని విభాగాలలో అభివృద్ధి చేయుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి మాజీ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, నాయకులు మత్స సోమేశ్వరరావు, సిరిపురపు వెంకట్రావు, చప్ప కృష్ణ, పాలూరి కృష్ణారావు, మరగడ గౌరీ రెడ్డి, బర్ల కనక, చలుమూరి ఎర్నాయుడు, కడితి ఈశ్వరరావు, సారిక ఎన్ని బాబు, జొన్నాడ గౌరీ అప్పారావు, కళింగపటపు అప్పన్న, గుడివాడ నరసింహులు, గెద్ద అప్పలనాయుడు, కొత్తకోట అశోక్, కళింగపటపు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన ప్రయోగశాలను ప్రారంభించిన కోరమాండల్ ఇంటర్నేషనల్

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ వ్యవసాయ-ఇన్‌పుట్‌ల సంస్థ అయినకోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, కాకినాడలోని తమ ప్లాంట్‌లో అధునాతన మట్టి మరియు ఆకు పరీక్షా ప్రయోగశాలను ప్రారంభించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో కూడిన ఈ సదు పాయం, భారతదేశం అంతటా రైతులు తమ నేల మరియు దాని పోషకస్థాయిని బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడే రీతిలో ఖచ్చితమైన మట్టి మరియు మొక్కల పోషక విశ్లేషణను అందించడానికి రూపొందించబడింది. ఇది వ్యవసాయ-ఎరువులవినియోగంపై తగిన సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి, భవిష్యత్ తరాల కోసం నేల ఆరోగ్యాన్ని కాపాడుతూనే పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి తోడ్పడుతుంది. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ నాయకత్వ బృందం సమక్షంలో ఈ హైటెక్ ప్రయోగశాలను ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శంకరసుబ్రమణియన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ ప్రయోగశాలలో అవసరమైన మట్టి మరియు మొక్కల పోషకాలను ఖచ్చితంగా గుర్తించగలిగే ఇండక్టివ్లీ కపుల్డ్ ప్లాస్మా ఆప్టికల్ ఎమిషన్ స్పెక్ట్రోస్కోపీ వివరణాత్మకంగా ఆకు పోషక విశ్లేషణను తెలిపే ఎనర్జీ డిస్పర్సివ్ ఎక్స్-రే ఫ్లోరోసెన్స్ వంటి అధునాతన పరికరాలు ఉన్నాయన్నారు. ప్రయోగశాలలో ఉన్న ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో స్పెక్ట్రోఫోటోమీటర్లు, మైక్రోవేవ్ డైజెస్టర్లు మరియు నియర్-ఇన్ఫ్రారెడ్ స్పెక్ట్రోమీటర్లు ఉన్నాయనీ, ఇవి సమగ్రమైన మరియు ఖచ్చితమైన పరీక్షా సామర్థ్యాలను నిర్ధారిస్తాయి. ఈ సాధనాలు రైతులకు మట్టి ఆరోగ్యం మరియు పోషకాల లభ్యతపై విలువైన పరిజ్ఞానం అందిస్తాయి, ఎరువుల వినియోగాన్ని మెరుగ్గా చేయటం ద్వారా ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి వీలు కల్పిస్తాయి. పోషక లోపాల సమస్యలను పరిష్కరించడం, వంట దిగుబడిని మెరుగుపరచడం మరియు అనవసరమైన ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం ద్వారా, ప్రయోగశాల దీర్ఘకాలిక నేల ఆరోగ్యం మరియు స్థిరమైన వ్యవసాయానికి మద్దతు ఇస్తుందని చెప్పారు.

# గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతి

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక 1వ వార్డు బంగ్లామెట్టలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడని గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలోని ఔన్నత్యాన్ని తెలియజేశారు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు బహుభాషా శాస్త్రవేత్త, సంఘసంస్కర్త గిడుగు అని శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు అని గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందని పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైందని గిడుగు రామ్మూర్తి జయంతి ఆగష్టు 29ని "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నామని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, ఈగల సంజీవి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే అధికారులు అత్యుత్సాహం

విశాలాంధ్ర - భీమిలి: నేషనల్ హైవే అధికారులు భీమిలి మండలం బోడమెట్టపాలెం రెవెన్యూకు చెందిన టోల్గేట్ దగ్గర్లో హైవేకు కొంచెం దూరం లో పేదల జీవనోపాధి అయినటువంటి వ్యాపార బడ్డీని తొలగించారు. అయితే ఈ తొలగింపుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అనేక అక్రమ కట్టడాలను ఏమీ చేయకుండా పేదవారిపై అధికారాన్ని ఉపయో గించారని తద్వారా వారి కుటుంబం నడిరోడ్డున పడుతుందని, తీసివేసిన వ్యాపార బడ్డీని వెంటనే పున: నిర్మించాలని అధికారులకు తెలిపారు. అయితే ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాధికారులపై ఎంతైనా ఉందని మోధవలస వద్ద మార్కెట్ యార్డ్‌కు ఆనుకుని ఉన్న నేషనల్ హైవే స్థలంలో ఆక్రమణదారులు సుమారుగా 10 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి పర్మినెంట్ కనస్ట్రక్షన్ చేసి లక్షల రూపాయలు అడ్వాన్సులు పొంది 5000 నుంచి పదివేల వరకు రెంటల్ వసూలు చేస్తున్నా వారికి భయపడి పట్టించుకోని అధికారులు పేద ప్రజలపై అధికార బలాన్ని చూపిస్తున్నారని ఈ సందర్భంగా స్థానికలు వాపోయారు.

# 80 మంది గీతం ఎంబిఎ విద్యార్థులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాలలో బుధవారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 80 మంది ప్రముఖ కార్పోరేట్ సంస్థలలో భారీ వేతనంతో ఉద్యోగాలను సాధించారు. విద్యార్థులలో పలువురు రూ. 11 లక్షల వార్షిక వేతనంతో ప్రాంగణ నియామకాలలో ఎంపిక అయినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు. ప్రముఖ కార్పోరేట్ సంస్థలు డెలాయిట్, రిలయన్స్ బిపి మొబిలిటి లిమిటెడ్, బెర్కాడియా బిఎస్ఎమ్ సొల్యూషన్స్, ఎక్సెంచూర్, విప్రో, బజాజ్ఎలాక్ట్రికల్స్, టివిఎస్ మోటార్స్, ఓరాకిల్, ఎడిపి, ప్రైస్ వాటర్ కూపర్, కాల్గేట్ పామోలివ్, గ్రాసిమ్ తదితర సంస్థలు ఈ ప్రాంగణ నియామకాలను నిర్వహించాయని ఆయన తెలిపారు. రానున్న రోజులలో మరికొన్ని ప్రముఖ కంపెనీలు ప్రాంగణ నియామకాలను జరపనున్నాయని తెలిపారు.

విద్యార్థులకు ప్రణాళికయుతంగా శిక్షణ ఇవ్వడం, కార్పోరేట్ రంగం నిపుణులతో చర్చాకార్యక్రమాలు నిర్వహించడం ప్రాంగణ నియామకాలలో విద్యార్థులు విజయం సాధించడానికి ఉపయోగపడిందని గీతం కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ కె.వి.సంధ్యారాణి తెలిపారు. కాగా విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు అభినందించారు.

# విశాలాంధ్ర శ్రీకాకుళం

## కమ్మసిగడాం జాతర గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - రణస్థలం: ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో నిర్వహించే కమ్మసిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి జాతరకు సంబంధించిన గోడ పత్రికను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రథసప్తమి మంగళవారం ఉదయం 11 గంటలకు పెళ్ళిరాట వేయటం జరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లుచేసినట్లు చెప్పారు. వ్యాపారస్తులు ముందస్తుగా వచ్చి వ్యాపారస్థలాలు బాగుచేసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు, ఒడిశా నుంచి యాత్రికులు తరలివస్తారని చెప్పారు. ఆలయ కమిటీ జాతరకు పూర్తి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పోలీసుశాఖ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా. జరగకుండా బందోబస్తు నిర్వహి స్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, సూర్య తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీ ప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, సింహాచల రాయుడు, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, గురాల రఘునాద్, మన్నె వరహామూర్తి, గోపిన కృష్ణారావు, నడుకుదిటి గిరి తదితరులు పాల్గొన్నారు.

## 29న ప్రతిభ కల్గినవారికి 'జి.ఈ.ఓ' ఎక్సలెన్స్ అవార్డ్స్
## జి.ఈ.ఓ అధ్యక్షులు సద్గుణ

విశాలాంధ్ర-నరసన్నపేట: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విధ్యార్థులకు, సేవకులకు ఈ నెల 29వ తేదీన జి.ఈ.ఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ అందచేస్తున్నామని గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్(జి.ఈ.ఓ) అధ్యక్షులు, సద్గుణ అన్నారు. బుధవారం స్థానిక వి.ఎన్.బి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సద్గుణ మాట్లాడుతూ జిఈఓ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎంతోమంది పేద విద్యార్థులను చదివిస్తున్న విషయం తెలిసిందే. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కల్గిన విద్యార్థులు, సంఘ సేవకులు, వైద్యులు, ఉపాధ్యాయులుకు, సామాజిక సేవలందించిన వ్యక్తులకు గుర్తించి, ఘనంగా సత్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి నరసన్నపేట అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటాయన్నారు. ప్రతీ సంవత్సరం జిఈఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మరిన్ని వివరాలకు జిఈఓ ఆర్గనైజేషన్‌కు సెల్ నెం-9492143264కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ప్రముఖులు, పూణ్ణ వేంకటేశ్వరరావు, స్వరూప్, శివతేజ, ఎం.సుధాకర్, సంతోషి, కరుణశ్రీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ క్లబ్ స్థల వివాదంపై ఆర్డీవో విచారణ

విశాలాంధ్ర-పొందూరు: మండల కేంద్రంలోని నాది నాదాంటూ నాగులాట పెంచుకుంటూన్నా పొందూరు సోషల్ క్లబ్ స్థలంపై నెలకొన్న స్థల వివాదంపై శ్రీకాకుళం ఆర్డీవో కె. సాయిప్రత్యూష బుదవారం విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 188 సర్వేనంబరు పోరంబోకు (ప్రభుత్వస్థలం)లో ఉన్న సోషల్ క్లబ్ స్థలం తమదేనంటూ ఆరుగురు వ్యక్తులు 187 సర్వేనంబరుతో పొజిషన్ ధృవపత్రం పొందారు. వీరినుంచి కొనుగోలు చేసి వేరొక వ్యక్తి ఈస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని సర్పంచ్ ఆర్. లక్ష్మితో పాటు క్లబ్ ప్రతినిధులు వ్యతిరేఖించి అధికారులకు పిర్యాదు చేసారు. దీనిపై ఆర్డీవో సాయిప్రత్యూష తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. రెవెన్యూ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ ఎస్ఎల్ ఆర్ రికార్డు లలో ఈక్లబ్ 188 సర్వేనంబరు ప్రభుత్వస్థలంలో ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ రికార్డులలోను ఈ స్థలం పంచాయతీ స్థలంగా ఉన్నటు గుర్తించారు. స్థలవివాదానికి వీఆర్వో జారీ చేసిన పొజిషన్ ధృవపత్రమే కారణమని నిర్ధారణ చేసారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా పొజిషన్ ధృవపత్రం జారీచేసిన వీఆర్వో పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజలుకు ఆర్డీవో ఆదేశించారు. పంచాయ తీ రికార్డుల ఆధారంగా నివేదిక ఇవ్వాలని ఈవో మోహన్ బాబును ఆదేశించారు. ఈస్థలం పై సమగ్ర సర్వే నిర్వహించి సమగ్రనివేదిక అందించాలని తహసీల్దారు సూచించారు. ప్రభుత్వభూముల పరిరక్షణే ధ్యేయమని.ప్రభుత్వభూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నాడు నేడు రికార్డులు అందుబాటులో ఉంచాలి

విశాలాంధ్ర-పొందూరు: నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలల్లో నాడు-నేడు పనులకు సంభందించిన రికార్డులను అందుబాటులో ఉంచాలని ఆదేశించడం జరిగిందని శ్రీకాకుళం డిప్యూటీఈవో ఆర్, విజయకుమారి అన్నారు. మండలం లోలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుదవారం పరిశీలించారు. నాడు-నేడు జరిగిన పాఠశాలల్లో సామాజిక తనికీలు జరుగుతున్నాయని సంభందిత పాఠశాలలో తనికీలు నాటికి రికార్డు లన్నీ విధిగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు టీఐఎస్ శతశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత హెచ్ఎంలదేనని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల రికార్డులను పాఠశాల రికార్డులను తనికీ చేశారు. ఈమెతోపాటు ఎంఈవో-2 పట్నాన రాజారావు, హెచ్ఎం సంజీవిరావు ఉన్నారు.

## పాడి పశువులతో నిరంతర ఆదాయం: ఏడి ఆనంద్‌రావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పాడిపశువుల వలన రైతుకు నిత్యం ఆదాయం అని మూగజీవులైన పశువులకు వైద్యం అవసరమని ప్రతి రైతు గుర్తించి ఉచిత పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఏడి డాక్టర్ ఆనంద్ రావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలలో భాగంగా మండలం లోని కుద్దిరాం 21 వ వార్డ్ ఆమదాలవలస మున్సిపాలిటీ లో ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీ లో అధిక పశు సంపద కలిగిన వార్డ్ లలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని శాసన సభ్యులు కూన రవికుమార్ ఆదేశానుసారం సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహిస్తున్నారు. కుద్దిరాం లో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక నాయకులు పొన్నాడ ఆదినారాయణ ప్రారంభించి రైతులకు అవసరమైన మందులను తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ శిబిరం లో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, సాధారణ పశువులకు చికి త్సలు,లేగ దూడ లకు ఏలిక పాముల నివారణ మందులు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు మరియు పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్యం పై అవగాహన కల్పించడం జరిగినదని సహాయ సంచాలకులు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.